




ఆలయం నాడు..



బాలబాలాజీ స్వామికి తొలి హారతి

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

ఆదాయం రూ.3.77 లక్షలు

మామిడికుదురు, మే3(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున తొలిహారతి ఇచ్చి సుప్రభాత సేవను వేడుకగా చేశారు. శనివారం ఒక్కరోజే స్వామివారిని 5,500 మంది భక్తులు దర్శించుకోగా, 3 వేలమంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవ టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,77,076 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారికి కె.గంగవరానికి చెందిన ఉండమట్ల చంద్రరావు, వెంకటరామలక్ష్మి దంపతులు రూ.10,116ను విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి చిత్రపటంతో అభినందించారు.

10వ తేదీ వరకే సమ్మర్ క్యాంపులు

డీఈవో సలీంబాషా

అమలాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు ఈనెల 10వ తేదీతో ముగియనున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు పాఠశాలల నుంచి దూరం కాకుండా వేసవి ఉష్ణోగ్రతలకు లోనుకాకుండా ఉండేందుకు కోనసీమ జిల్లాలో గత నెల 24 నుంచి ప్రారంభించిన సమ్మర్ క్యాంపులు ఈనెల 10వ తేదీతో ముగుస్తాయన్నారు. విద్యారంగంలో వస్తున్న వినూతన్న మార్పులను దృష్టిలో పెట్టుకుని అమలాపురం, ముమ్మిడివరం రామచంద్రపురం, యేడిద, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల కేంద్రాల్లో ఈ తరగతులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ క్యాంపుల్లో సబ్జెక్టుల వారీగా బోధనలు, హ్యాండ్ రైటింగ్ మెరుగుదల, డ్రాయింగ్ నైపుణ్యం, శారీరక వ్యాయామాలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ కేంద్రంలో 70 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా వారి ప్రతిభను చాటి చూపుతున్నట్టు తెలిపారు. మే 9వ తేదీన కెరీర్ గైడెన్స్ పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలపై రిసోర్స్ పర్సన్లు సమగ్రంగా మార్గనిర్దేశం చేస్తారని డీఈవో తెలిపారు. సమ్మర్ క్యాంపుల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే వారిని గ్రామ పెద్దలు, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించడం జరుగుతుందన్నారు. శిబిరాలు విజయవంతం చేయడానికి సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞత తెలిపారు.

ఆపదమొక్కుల.. వాడపల్లి!

ఏడు వారాల వెంకన్నగా వినుతి

ఆదివారం ప్రత్యేకం



ఆలయం నేడు..



ఉన్నావా అసలున్నావా.. ఉంటే కళ్లుమూసుకున్నావా.. భక్తతుకారాం సినిమాలో పాట ఇది.. నిన్న మొన్నటి వరకూ చాలామంది అభిప్రాయం కూడా ఇదే.. దేవుడు లేడనేది వాదన.. ఈ అభిప్రాయం తప్పని.. నేనున్నానని నిరూపించాడు.. వాడపల్లి వేంకటేశ్వరుడు. అందుకే ఆయనను నిదర్శనమూర్తిగా కొలుస్తారు. నిజానికి 2009 వరకు ఆ స్వామిని కొలిచేవారే అరుదు.. కల్యాణోత్సవాల సమయంలో తప్ప ఆ స్వామి చెంత సందడే ఉండేది కాదు.. మరి నేడు.. ప్రతి వారం లక్షలాదిగా భక్తులను తన చెంతకు రప్పించుకుని కోరిన కోర్కెలు తీర్చే ఆపదమొక్కుల వాడిగా వినుతికెక్కారు.. అమెరికా.. ఆస్ట్రేలియా.. తదితర దేశాల నుంచి భక్తులు వస్తున్నారంటే ఆ స్వామి దయ కాకపోతే మరేమిటి.. కోరిన కోర్కెలు తీరుస్తాడనే నమ్మకమే వాడపల్లికీ మహర్దశ. - ఆత్రేయపురం

దేవుడున్నాడు.. భక్తజనం కోర్కెలు తీరుస్తున్నాడు.. అందుకే ఒక్కటా రెండా ఏకంగా ప్రతి శనివారం 40 వేల నుంచి 50 వేల మంది భక్తులు ఆ స్వామిని చూసేందుకు ఎక్క డెక్కడి నుంచో వస్తున్నారు. స్వామిని దర్శించుకుని వెళుతున్నారు. ఒకనాడు ఎక్కడ ఉందో తెలియని వాడపల్లి.. వేంకటేశ్వరుడి ఊరుగా తిరుమల అంత ప్రసిద్ధి కెక్కింది. గౌతమి నదీ తీరాన పచ్చని పంటపొలాల నడుమ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజన గోవిందనామస్మరణతో విరాజిల్లుతుంది. సుమారు 15 ఏళ్ల కిందట ఏడాదికోమారు స్వామి ఉత్సవాలు చేయాలంటేనే కష్టం.. అటువంటి స్థితి నుంచి నేడు తిరుమల తరహాలో ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అలనాడు వందల్లో భక్తులుంటే నేడు ఆ సంఖ్య వేలకు చేరింది. ఓ భక్తుడు సొంత విమానంలో వచ్చి స్వామిని దర్శించుకుని రూ.కోటి విరాళం అందించి వెళ్లారంటే స్వామి ఎంత మహిమాన్వితుడో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత స్వామి వార్షికాదాయం రూ.32 కోట్లకు చేరుకుంది.

ఎర్రచందనం కొయ్యతో స్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో స్వయం భూ ఎర్రచందన కొయ్య విగ్రహంతో మూర్తీభవించిన స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిస్తారు. దేవతామూర్తుల విగ్రహాలను శిలతో తయారు చేస్తే స్వామి మాత్రమే ఎర్రచందనంతో మూర్తీభవించారు.

2009 నుంచి 7 ప్రదక్షిణలు..

2009 మార్చి 23న అప్పటి ఈవో, సిబ్బంది ఏడు వారాల వెంకన్న దర్శనం..ఏడేడు జన్మల పుణ్యఫలంగా స్వామి ఖ్యాతిని ఇనుమడింప జేశారు.. అక్కడి నుంచి స్వామి వెనుతిరిగి చూసుకోలేదు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా అంచలంచెలుగా వినుతికెక్కారు. ఏడు శనివారాలు.. స్వామివారి ఆలయంలో ఏడు ప్రదక్షణలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. తిరుమల తరహాలో పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, గోదాదేవి కల్యాణం కోట్లాది రూపాయలతో నిర్వహిస్తున్నారు. నిత్యం ఆలయంలో ఐశ్వర్యలక్ష్మీ హోమం, నిత్యకల్యాణం, అష్టోత్తర పూజలు చేస్తారు.

నాడు వడ్డికాసులవాడే..

2009కి ముందు స్వామి వార్షికాదాయం రూ.18 లక్షలు ఉండేది. ప్రతి ఏటా మార్చి నెలలో స్వామి కల్యాణం నిర్వహిస్తారు. ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో అప్పటి ఈవో, సిబ్బంది రూ.3 లక్షల వరకూ అప్పు తెచ్చేవారట. అనంతరం శిస్తును వసూళ్లు చేసి స్వామి కల్యాణం అప్పులు తీర్చేవారు. ప్రస్తుతం 6-ఏ నుంచి డిప్యూటీ కమిషనరు స్థాయికి ఈ క్షేత్రం చేరుకుంది. వార్షికాదాయం రూ.18 లక్షల నుంచి నేడు రూ.32 కోట్లకు చేరుకుంది. 2023లో డీసీ హోదా దక్కించుకున్న ఈ క్షేత్రం 2026లో రీజనల్ జాయింట్ కమిషనరు హోదాకు చేరుకోనుంది. ఆలయంలో 310 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా జీతభత్యాల కింద రూ.6.32 కోట్లు చెల్లిస్తున్నారు.

భూములు.. 116 ఎకరాలు



తిరుమల తరహాలో స్వామికి దాతలు బంగారు విరాళాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం స్వామివారికి 7.421 కిలోల బంగారం ఉంది. వెండి 183.339 కిలోలు ఉంది. స్వామికి 406 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 116 ఎకరాలు మాత్రమే ఆధీనంలో ఉంది. దీని ద్వారా రూ.35 లక్షల ఆదాయం వస్తుంది. మిగిలిన భూమి అన్యాక్రాంతమైనట్టు తెలిసింది.

నిత్యాన్నదానం

నిత్యాన్న దానం ఉంది. ప్రతి నెలా 1.50 లక్షల మంది భక్తులు స్వామి ప్రసాదం స్వీకరిస్తారు.రూ.40 లక్షలు ఖర్చవుతుంది. అన్నప్రసాదానికి రూ.11.09 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. రూ.120 కోట్లతో కేంద్రం అందించే ప్రసాద స్కీమ్‌కు ప్రతిపాదనలు చేసి నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆదాయం రూ.39 కోట్లు

ఏడాది	ఆదాయం	ఖర్చులు (కోట్లు)
2021-22	రూ.9.36	రూ. 8.68
2022-23	రూ.18.82	రూ.18.14
2023-24	రూ.28.88	రూ. 26.53
2024-25	రూ.39.09	రూ. 32.01

ఫిక్సిడ్ డిపాజిట్లు రూ.3.65 కోట్లు
సేవింగ్స్ ఖాతాలో సుమారు రూ.5 కోట్లు

స్వామి వెలిశాలిలా..

విష్ణుమూర్తి ఒకప్పుడు నౌకాపురిగా పిలిచే వాడపల్లిలో వెలుస్తానంటూ అభయమిచ్చాడట.. కొంత కాలానికి గోదావరిలో ఒక పెట్టె కొట్టుకువచ్చింది.. ఒక వృద్ధుడికి స్వామి కలలో కనిపించి ఆ చందన పెట్టె గురించి తెలియజేశాడట.. మరునాడు పెట్టె తీసి తెరిస్తే ఎర్రచందనంతో చెక్కిన స్వామి దివ్య మంగళమూర్తి కనిపించిందట. ఇది తెలిసి నారదుడు స్వామికి వేంకటేశ్వరుడు అని నామకరణం చేసి ఆలయాన్ని నిర్మించాడని పురాణ కథనం.

ఇదేమి కాలం!



అబ్బబ్బా ఇది ఏమి వాన: కాకినాడ నగరంలో శనివారం కురుస్తున్న వాన

ఉదయం కుమ్మడు.. సాయంత్రం దంచుడు

- వాతావరణంలో పెనుమార్పులు
- ఉదయం ఎండ.. సాయంత్రం వాన
- 4 రోజులుగా విస్తారంగా వర్షాలు
- శనివారం కాకినాడలో అత్యధికం
- సాధారణ స్థితికి వర్షపాతం
- ఆశ్చర్యపోతున్న అధికారులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్రమైన ఎండ.. ఉదయం ఏడు నుంచే నడినెత్తిన సూర్యుడి ప్రతాపం.. బయటకు రావాలంటేనే ఎండవేడికి ఉక్కబోత..చెమటలతో తడిచి ముద్దవుతున్న పరిస్థితి.. మరో పక్క అంత ఎండతో ఆపసోపాలు భరిస్తోన్న ప్రజలకు సాయంత్రం అయ్యేసరికి ఒక్క సారిగా వరుడి కరుణతో ఉపశమనం.. చిరుజల్లుల నుంచి కుండపోత వానతో చల్లబడుతోన్న వాతావరణం.. ఒకపక్క ఈదురుగాలులు.. మరోపక్క కూలుతోన్న విద్యుత్ స్తంభాలు.. నేలకొరుగుతున్న చెట్లతో విచిత్ర పరిస్థితులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నెలకొన్నాయి. మండు వేసవితో



ఎండకు తాళలేక..

అల్లాడించే ఏప్రిల్, మే నెలల్లో గడచిన కొన్నిరోజులుగా భారీ వర్షాలు జిల్లాను ఊపేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఉదయం తీవ్రమైన వేడి.. సాయంత్రం అయ్యేసరికి భారీ వర్షాలతో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో శనివారం అనేక చోట్ల 38డి గ్రీలకుపైగా ఎండ చుక్కలు చూపించగా..మధ్యాహ్నం దాటేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉన్నట్టుండి కుండపోతగా వాన.. ఈదురుగాలులు..బీభత్సం సృష్టించాయి. కాకినాడ రూరల్‌లో అయితే ఏకంగా రాష్ట్రంలోనే అత్యధికంగా 4.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ నగరంలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వాన నీరు వచ్చేసింది. అటు కోటనందూరులో 2.7, కిర్లంపూడి 2.1, తుని 2.25, తాళ్లరేవు,శంఖవరం,రౌతులపూడి,గొల్లప్రోలు, పిఠాపురం, పెదపూడి మండలాల్లో 1.7, తూర్పుగోదావరి జిల్లా రంగంపేట 2.75, గోపాలపురంలో 0.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.అయితే ప్రధానంగా తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలతో పోల్చితే కాకినాడ జిల్లాలో గడచిన రెండువారాలుగా వర్షాలు అనేక మండలాల్లో దంచికొడుతున్నాయి. ఏకంగా భారీ ఈదురుగాలులు, కుండపోత వర్షం కురుస్తుండడం విశేషం. ఇటీవల అన్నవరంలో కురిసిన భారీ వర్షానికి ఆలయ మెట్లపై ధారలా వాననీరు ప్రవహించింది. శనివారం సైతం జిల్లాలో అనేక మండలాల్లో వానకుతోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అయితే ఏకంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కొన్నిరోజులుగా గాలివానకు పడుతూనే ఉన్నాయి.



పిఠాపురంలో వానకు తడవకుండా ధాన్యంపై కప్పిన బరకాలు

లోటు నుంచి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత నెల ఏప్రిల్‌లో కురిసిన వర్షాలు జిల్లాను లోటు నుంచి సాధారణ వర్షపాతం స్థాయికి తీసుకొచ్చాయి. వాస్తవా నికి అంతకుముందు మార్చి నెలలో ఉమ్మడి జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. కాకినాడ జిల్లాలో మార్చి నెలలో సాధారణ వర్షపాతం 12.49 సెంటి మీటర్లు కురవాల్సి ఉంటే 0.82 సెం.మీతో లోటులో ఉంది. కోనసీమ జిల్లాలో 12.02 సెం.మీ.కు సున్నా వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో 15.18 సెం.మీకు 0.04 మి.మీ కురిసింది. ఏప్రిల్ నెలలో కాకినాడ జిల్లాలో 16.4 సెం.మీ. వర్షం కురవాల్సి ఉంటే ఏకంగా 45.81 సెం.మీ వర్షపాతం నమోదైంది. కోనసీమ జిల్లాలో 10.52 సెం.మీ.కు 20.17 సెం.మీ. కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో 16.73 సెం.మీ.కు 47.49 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒకరకంగా ఈ నెలలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదవడం అరుదని వాతావరణ శాఖాధికారులు వివరించారు.

పోలమ్మ చెరువు స్టోరేజ్ ట్యాంకు







పిచ్చిమొక్కలతో వాకింగ్ ట్రాక్.. తొలగించిన ధ్వంసమైన సిమెంటు పలకలు

ముందుకు పడని అడుగులు!

- నడక దారి ధ్వంసం
- వాకర్స్‌కు ఇబ్బందులు
- రూ.కోటి నిధులతో ఆధునికీకరణకు ప్రతిపాదనలు

ముమ్మిడివరం, మే3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ధ్వంసమైన పోలమ్మచెరువు గట్టు వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. పోలమ్మచెరువుగట్టు వాకింగ్ ట్రాక్ ధ్వంసంకావడంతో పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పోలమ్మ చెరువు వాటర్ స్టోరేజ్ చుట్టూ 1100 మీటర్ల మేర గట్టును పది అడుగుల వెడల్పుతో గ్రావెల్‌తో ఆధునికీకరించి వాకర్స్ సేదతీరేందుకు సిటింగ్ బెంచీలు, వ్యాయామానికి ఓపెన్‌జిమ్ పరికరాలు, సుందరీకరణ, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సంబంధించి ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు రూ.కోటితో ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే ఓఎన్జీసీ ప్రతినిధులు వాటిని పరిశీలించి వెళ్లారు. ముమ్మిడివరం పట్టణంలో 25,355 మంది జనాభా ఉన్నారు. ప్రజలు సాయంకాలం వేళలో సేద తీరేందుకు పట్టణానికి సంబంధించి సరైన పార్కుగానీ, వాకింగ్ చేయడానికి అనువైన ప్రదేశంగానీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య రీత్యా నడక తప్పనిసరి అయింది. ముమ్మిడివరం ప్రధాన రోడ్డు నేషనల్ హైవే కావడంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో వాకింగ్‌కు వెళ్లేవారు రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలూ జరుగుతున్నాయి. దీంతో వాకింగ్‌కు వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు.

గతంలోనే నిర్మించినా..

2010లో నాటి మంత్రి పినిపే విశ్వరూప్ పోలమ్మచెరువు వాటర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టూ 1100 మీటర్ల మేర గట్టును రూ.కోటి70 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మింపజేశారు. అయితే అది నిర్మించిన రెండేళ్లకే 2012 ఆగస్టులో కురిసిన వర్షాలకు ట్యాంకు చుట్టూ ఉన్న గట్టు దిగబడిపోయింది. వాకింగ్ ట్రాక్‌కు వేసిన టైల్స్ కూడా ధ్వంసమయ్యాయి. పలుచోట్ల గట్టు రెండున్నర మీటర్ల లోతున కుంగిపోయింది. దీంతో వాటర్ స్టోరేజ్ ట్యాంకు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి నాణ్యతా ప్రమాణాల లోపం కారణంగానే గట్టు కుంగినట్టు నిర్ధారించారు. 2015-16లో అప్పటి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కొత్తగా అంచనాలు రూపొందించినా నిధులు మంజూరు కాలేదు. తర్వాత ఆర్‌డబ్ల్యు ఎస్‌శాఖ అధికారులు రూ.50 లక్షలతో గట్టు పటిష్టం చేశారు. తాజాగా ట్రాక్ పనుల కోసం ప్రతిపాదనలు చేశారు.

కమ్మిన మబ్బులు.. కల్లాల్లో ధాన్యం



వాతావరణంలో మార్పులు.. రైతుల్లో కలవరం

ముమ్మిడివరం, మే3 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఆకస్మిక మార్పులతో వర్షపు జల్లులు పడడం.. కూలీల కొరతతో రబీ మాసూళ్లకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాలతో వరికోతలు చేపడుతున్నా.. ధాన్యాన్ని ఎండబెట్టేందుకు కూలీలు దొరకకపోవడంతో వరి మాసూళ్ల పనులు ముందుకు సాగడం లేదు. గత నాలుగైదు రోజులుగా వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవించి వర్షపు జల్లులు పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో లక్షా 64వేల 529 ఎకరాల్లో వరి సేద్యం జరిగింది. ఇప్పటి వరకు 80వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తి అయినట్టు వ్యవసాయ అధికారుల అంచనా. ఇంకా 84,529 ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉంది. అయితే కోతలు పూర్తయిన 80వేల ఎకరాలకు సంబంధించి సుమారుగా 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్టు అంచనా. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా 93వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగింది. ఇంకా 2 లక్షల 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లోనే వివిధ దశల్లో ఉంది. అయితే యంత్రాల ద్వారా కోసిన ధాన్యం ఎండబోసేందుకు కూలీలు దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మగ మనిషికి రోజుకు రూ.800 నుంచి రూ.వెయ్యి డిమాండ్ చేస్తుంటే మహిళా కూలీలు రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు డిమాండ్ చేస్తున్నారు. సరిగా కోతలు ముమ్మరంగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టడంతో వారంతా ఆ పనులకు వెళ్లిపోతున్నారు. జిల్లాలో మురుగుకాల్వలు, సాగునీటి కాల్వలు, బోదెలలో పూడికతీత పనులు, కొబ్బరి చెట్లకు పళ్లాలు కొట్టడం వంటి సుమారు 829 పనుల్లో 54,933 మంది కూలీలు పనిచేస్తున్నారు. దీంతో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉంది. కనీసం యంత్రాలతో కోసిన ధాన్యాన్ని వేసేందుకు బరకాలు వేసే కూలీలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. పశుగ్రాసం కోసం యంత్రాలతో కోసిన గడ్డిని రైతులు ఒబ్బిడి చేసుకోలేని పరిస్థితి రైతులకు ఏర్పడింది. వరి కోతలు పూర్తి అవ్వడానికి ఇంకా 10 లేదా 15 రోజులు పడుతుంది. ఆకాశం మేఘావృతమై ఉండడం, అక్కడక్కడా వర్షపు జల్లులు పడడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనై సాగు చేసిన పంట చేతికి అందివచ్చే సమయం ఈ పరిస్థితులు ఎదురవడంతో రైతులు దిక్కులోతోచని స్థితిలో ఉన్నారు. పండించిన పంట సక్రమంగా దక్కుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఉపాధి కూలీలు ధాన్యం ఎండబోత, గడ్డి పోగు చేసుకోవడానికి వంటి పనులకు వారిని ఉపాధిహామీ పథకంలో అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ఒక పదిహేను రోజులు ఉపాధి హామీ పనులు వాయిదా వేయాలని, అలాంటప్పుడే తమకు కూలీలు అందుబాటులో ఉంటారని అంటున్నారు.



ధాన్యం ఎండబెడదామంటే కూలీలు దొరకడం లేదు

వరిని యంత్రం ద్వారా కోసి రెండు రోజులు అయింది. ధాన్యం ఎండబెడదామంటే కూలీలు దొరకడం లేదు. వారు అడిగినంత కూలీ ఇస్తామన్నా ఎవరూ రావడం లేదు. యంత్రం ద్వారా కోసిన ధాన్యం రాశులు అలా ఉంటే రంగు మారే ప్రమాదం ఉంది. వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై ఆకస్మికంగా జల్లులు పడుతున్నాయి. ఈ సమయంలో వర్షం అధికంగా పడితే రైతులకు నష్టమే మిగులుతుంది.

\- బొబ్బిలి నాగభూషణం, అయినవిల్లి మండలం క్రాప, రైతు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఓవైపు హోరున కురిసిన వర్షం.. మరోవైపు రెట్టించిన ఉత్సాహంతో కబడ్డీ ఆడేందుకు సిద్ధమైన మహిళా, పురుష క్రీడాకారులు.. బీచ్ కబడ్డీని వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. వర్షానికి కబడ్డీ పోటీలు జరుగుతాయో లేదోనన్న మీమాంసతో నిర్వాహకులు ఉన్నారు. సాయంత్రం వర్షం తెరిపి ఇవ్వడంతో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం యథావిధిగా కొనసాగాయి.

- రెండోరోజు హోరాహోరీగా రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు
- వర్షం కురిసినా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు
- వీక్షించిన ఎమ్మెల్సీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- సెమీఫైనల్స్‌కు చేరిన మహిళా, పురుషుల జట్లు

సర్పవరం జంక్షన్, మే 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం సాయంత్రం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించిన 12వ రాష్ట్ర అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలు మహిళా, పురుషల జట్లకు వేర్వేరుగా హోరాహోరీగా సాగాయి. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా నువ్వా నేనా అన్న స్థాయిలో రసవత్తరంగా జరిగాయి. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి క్రీడా మైదానమంతా చిత్తడిగా మారినా ఎమ్మెల్యే నానాజీ యుద్ధప్రాతిపదికన కార్పెట్లు ఏర్పాటు చేసి కబడ్డీ పోటీలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. రెండోరోజు కబడ్డీ పోటీలను డిప్యూటీ సీఎం పవన్ సోదరుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు వీక్షించారు. అనంతరం ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని రాష్ట్ర క్రీడాస్ఫూర్తిని దేశానికి చాటిచెప్పాలని కోరారు. క్రీడలతో వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు రాష్ట్రానికి ఖ్యాతి లభిస్తుందన్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ



క్రీడాకారులకు సెల్ఫీ ఇస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన జట్లు జాతీయస్థాయికి ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. క్రీడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ క్రీడలను వ్యయప్రయాసల కోర్చి చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీని అభినందించారు. నానాజీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో ఫ్యాన్ పార్క్ ఐపీఎల్ క్రీడలు జిల్లా క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్టు సతీష్ తెలిపారు. బీచ్ సందర్శనకు వచ్చే వారికిఅన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు కుడా నుంచి రూ.3కోట్లు మంజూరు చేశామని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపారు. కబడ్డీ పోటీలను వీక్షించిన వారిలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు, గిడ్ల సత్యనారాయణ ఉన్నారు. వర్షం కారణంగా సాయంత్రం 4గంటలకు ప్రారంభం కావాల్సిన కబడ్డీ పోటీలు 6 గంటలకు ప్రారంభమయ్యాయి. తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు.

విజేతల వివరాలివి..

కాగా రెండోరోజు పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో విజయనగరం, చిత్తూరు, కృష్ణా, అనంతపురం జిల్లాల సెమీ ఫైనల్స్‌కు చేరాయి.


బెలూన్లను వదిలి రెండోరోజు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు



కబడ్డీ ఆడుతున్న మహిళ, పురుషుల జట్లు

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహణ

పిఠాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 5వ తేదీన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని కంతేటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలో ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు చిత్తూరులో ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ జరిగే ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. 2012 జనవరి 1 తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

రూ.54.94 లక్షల ఆదాయం


ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆల యానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వా మివారిని దర్శించుకుని తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించా రు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వా మి వారికి ఒక్కరోజు రూ.54.94 లక్షల ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి

వెండి కిరీటం బహూకరణ

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తాడేపల్లిగూడెనికి చెందిన జి.జగదీష్ దంపతులు 250గ్రాములతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ఈవో చక్రధర రావు దాతలకు స్వామి చిత్రపటం అందజేశారు.


వెండికిరీటం బహూకరిస్తున్న దాతలు

హత్య చేసి.. హైవే పక్కన పడేసి..

- భర్త హత్య కేసులో భార్య సహా ముగ్గురి అరెస్టు
- వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ


గొల్లప్రోలులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

గొల్లప్రోలు, మే 3(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య తన ప్రియుడు, స్నేహితుడితో కలిసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని జిల్లా దాటించి 75 కిలోమీటర్ల దూరంలో పడవేశారు. తమ గుట్టు బయటపడలేదని భావించారు. కానీ, మృతుడి తల్లి ఫిర్యాదు, సాంకేతికత అంశాల ఆధారంగా పోలీసుల దర్యాప్తుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి భార్యతో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవ రాజ్ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు.

మృతదేహం గుర్తింపుతో దర్యాప్తు

కాకినాడ జిల్లా పరిధిలోని కత్తిపూడి-కాకినాడ మధ్యగల 216వ జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో మార్చి 3న గుర్తు తెలియని వ్యక్తి 35-40ఏళ్ల మృతదేహం గాయాలతో కుళ్లిన స్థితిలో ఉండగా పోలీసులు గుర్తించారు. చేబ్రోలు వీఆర్వో ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి ఎస్పీ, ఏఎస్పీ ఆధ్వర్యంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. రాష్ట్రంతోపాటు సరిహద్దు రాష్ట్రాల మిస్సింగ్ కేసులు, జాతీయ రహదారిపై సీసీ కెమేరాలు, టోల్‌ప్లాజాల వద్ద సీసీ ఫుటేజీలు, సెల్‌టవర్ ఆధారంగా విచారణ సాగించారు. దర్యాప్తు సాగుతున్న సమయంలో అనకాపల్లి జిల్లా యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 28న తన కుమారుడు రెండునెలలుగా కనిపించడంలేదని తల్లి చేసిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదైంది. దీనిపై పరిశీలన జరపగా మృతదేహం యలమంచిలి పట్టణం ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగిళ్ల లోవరాజుగా గుర్తించారు. లోవరాజు భార్య శ్యామలకు భర్త బంధువైన మాడెం మోహన్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీన్ని కొనసాగించడానికి భర్త అడ్డంకిగా ఉన్నాడని వారిద్దరూ భావించారు. దీంతో మోహనకుమార్, అతడి స్నేహితుడు బల్లా గంగాధరరావు కలిసి ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి లోవరాజును హత్య చేసి చేబ్రోలు హైవే పక్కన పడవేశారు. 75 కిలోమీటర్ల దూరంలో జిల్లాను దాటి మృతదేహాన్ని ఇక్కడ పడవేయడం, రెండు నెలల వ్యవధిలో తమపై ఎవరికీ అనుమానం రాలేదని నిందితులు భావించారు. కుమారుడు కనిపించకపోవడం, కోడలి ప్రవర్తనపై అనుమానంరావడంతో మృతుడి తల్లి యలమంచిలి పోలీసులను ఆశ్రయించింది. దీని ఆధారంగా దర్యాప్తు జరపడంతో కేసు కొలిక్కి వచ్చినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ వివరించారు. భార్య, ఆమె ప్రియుడు, స్నేహితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన మారుతి ఎర్టిగా కారును సీజ్ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ, ప్రత్యేక దర్యాప్తు బృందం సభ్యులను అభినందించారు.

సివిల్స్‌లో ప్రతిభకే పట్టం

- మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు
- మూడో ప్రయత్నంలో విజయం
- సన్మాన కార్యక్రమంలో 247వ ర్యాంకర్ దొమ్మేటి వినయ్



వినయ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

చాగల్లు, మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే సివిల్స్ పరీక్షల్లో ప్రతిభకే పట్టం కడతారని డబ్బు, పలుకుబడికి ఎటువంటి అవకాశం ఉండదని దొమ్మేటి వినయ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెనికి చెందిన వినయ్ సివిల్స్ పరీక్షల్లో 247వ ర్యాంకు సాధించిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. విజయ్ మాట్లాడుతూ "అత్యంత క్లిష్టమైన సివిల్స్ పరీక్షల్లో లక్ష్యసాధన కోసం నిరుత్సాహపడకుండా నిరంతర సాధన చేయాలి. ఎప్పుడు విజయం సాధిస్తామో గ్యారంటీ లేకపోయినా పూర్తి నమ్మకంతో ఉండాలి. తిరుమలలో ఇంటర్ చేసి జేఈఈ పరీక్ష రాసి ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లో చేరాను. రెండో సంవత్సరంలో సివిల్స్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నా. విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం సివిల్స్ సర్వీసెస్‌లోనే ఉంది. దేశానికి, ప్రజలకు సేవ చేసే అవకాశం ఆలిండియా సర్వీసుల్లోనే ఉంది. సివిల్స్‌లో మూడు దశలు ఉంటాయి. ఏ దశలో ఆగిపోయినా మళ్లీ మొదటి నుంచి రాయాలి. మొదటి సారి ర్యాంకు సాధించి ఇంటర్వ్యూకి వెళ్లా కానీ అక్కడ సెలెక్ట్ కాలేదు. మూడోసారి రాసినప్పుడు 247వ ర్యాంకు సాధించాను. 24వ ఏటనే నాకు ఈ అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇంట్లో ఒత్తిడి లేనప్పుడే చదువులో వారికి వారే నిర్ణయాలు తీసుకుంటారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురైతే తల్లిదండ్రులు గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలి. ఇంటర్వ్యూలో ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి గురించి అడిగారు. నా అభిప్రాయాలను కచ్చితంగా చెప్పాను. నా విజయం పట్ల గ్రామస్థులు సంతోషంగా ఆహ్వానించి సన్మాన కార్యక్రమం నిర్వహించినందుకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబురావు, ఆత్కూరి దొరయ్య, టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివాసరావు, పత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి కాశివిశ్వనాథం, దొమ్మేటి మేణు, కరుటూరి రామారావు, గారపాటి కృష్ణ, సీహెచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం కొవ్వూరులో ఉంటున్న విజయ్ తండ్రి జగదీశ్వర రావు విద్యుత్ ఏఈ కాగా తల్లి కనకదుర్గ గృహిణి. కుమారుడి విజయంలో కీలకపాత్ర పోషించిన తల్లిదండ్రులను సభికులు కొనియాడారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

బావే చంపేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు


ఫైల్‌ఫొటో

శంఖవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది కొత్తపల్లికి చెందిన మిమిడి లోకేశ్వరి (19) ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించింది. తొలుత ఆత్మహత్యగా భావించిన తల్లిదండ్రులు పోలీసు ఫిర్యాదు లేకుండా దహన కార్యక్రమాలు చేసేద్దామనుకున్నారు. అయితే మృతురాలి అక్క భర్తపై అనుమానం రావడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దివ్యాంగురాలైన తన అక్క భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని గ్రామంలో పుకార్లు రావడంతో శుక్రవారం ఆ మహిళ ఇంటికి వెళ్లి లోకేశ్వరి తన బావ జోలికి రావొద్దని హెచ్చరించింది. ఈ విషయం తెలుసుకున్న బావ లోకేశ్వరిని మందలించాడు. దీంతో ఇద్దరికి వాగ్వాదం జరిగింది. అదేరోజు సాయంత్రం ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించింది. తన పెద్దల్లుడే తన కూమార్తెను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నాడని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్యాంగురాలైన తన అక్క కాపురం చెడిపోతుందనే మనస్థాపంతో యువతి ఆత్మహత్య చేసుకుందని అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. శవపంచనామా నివేదిక ఆధారంగా దర్యాప్తు చేసి చర్యలు చేపడతామని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.


లోకేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

'ఉమ్మడి జిల్లాలో ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఆఫ్ ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ఈవో, సూపర్‌వైజర్స్ జిల్లా సమావేశం కాకినాడ ఫుడ్ స్ట్రీట్ శాంతిభవన్‌లో శనివారం నిర్వహించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ పి.ప్రకాష్ కుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని వాపోయారు. అంగన్‌వాడీ లెవెల్ నుంచి సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బందికి మొబైల్ యాప్స్‌తో పని భారం చాలా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లా ప్రెసిడెంట్‌గా ఎన్.పద్మశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.అరుణ, జిల్లా ట్రెజరర్‌గా కే.నిర్మల కుమారి, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కే.రమణికుమారిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.



నూతనంగా ఎన్నికైన మహిళా శిశు విభాగం ఉద్యోగుల కాకినాడ జిల్లా కార్యవర్గం

ఓబీఈపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, మే 3(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ(యూసీఈకే)కు త్వరలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) బృందం రానున్న దృష్ట్యా శనివారం సెనేట్ హాల్లో అధ్యాపకులకు ఎన్‌బీఏ గుర్తింపునకు చేపట్టాల్సిన విధానాలు, అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ)పై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) సీఎస్ఈ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ టి.రమేష్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. రమేష్ మాట్లాడు తూ మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకుల సమష్టి కృషి చాలా అవసరమన్నారు. నిర్దేశిత పాఠ్యప్రణాళిక, బోధన, బోధనా పద్ధతులు, మూల్యాంకనం, అభ్యసన తదితర వాటి రూపకల్పనపై అవగాహన పెంపొందించుకోవాలని అధ్యాపకులకు సూచించారు. రమేష్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, పద్మరాజు, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్,బాలకృష్ణ, దీక్షితులు అధ్యాపకులున్నారు.


రీసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద్

వాన...వే!


జగ్గంపేట జాతీయ రహదారిపై మురుగునీరు


శంఖవరం జాతీయ రహదారిపై నీటిని బోర్లతో తోడుతున్న స్థానికులు

శంఖవరం/జగ్గంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) వర్షం కురిసినప్పుడు రోడ్లపై వర్షం నీరు ఉండిపోవడం సాధారణమే విషయమే. అయితే జాతీయ రహదారిపై కూడా నీరు ఉండిపోతే. వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు తప్పవు. కాకినాడ జిల్లా శంఖవరం- కత్తిపూడి హైవే అయితే మారుమూల వీధిలా మారిపోయింది.. వర్షం, వాడకం నీరు కలిసి రాచబాటను ముంచెత్తింది. మురుగుని తొలగించేందుకు హైవే అథారిటీ, పంచాయితీ సిబ్బంది ఒకరినొకరు వంతులాడుకుని పదిరోజులుగా అలాగే వదిలేశారు. స్థానికులు ఇంజన్లు పెట్టి నీటిని బయటకు తొలగిస్తున్నారు. అలాగే జగ్గంపేట నాలుగు రోడ్ల జంక్షన్లో జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డులో మురుగు నీరు పోయే మర్గాలు లేక కొద్దిపాటి వర్షం వస్తే చాలు మురుగునీటితో రోడ్డు నిండిపోతుంది.

రైల్వే సిబ్బంది అపూర్వ కలయిక

సామర్లకోట, మే 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సామర్లకోట పరిధి రైల్వే ఎంప్లాయిస్ పాతమిత్రులు (1970-1985) కుమారులు, కుమార్తెలతో కలిసి గెట్ టూ గెదర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తమకు విద్య నేర్పిన గురువులు ఎస్.గోపాలా చార్యులు, శ్రీరామచంద్రమూర్తి, ఇండిగ సత్యనారాయణను ఆహ్వానించి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆత్మీయ విందు నిర్వహించారు. పాఠశాల తరగతి గదుల్లో జ్ఞాపకలను నెమరువేసుకున్నారు. అనంతరం జ్ఞాపికలు అందజేసుకున్నారు. కార్యక్రమానికి నాయకత్వం వహించినవారిలో సేపేని సురేష్, కాళ్ళ గోవిందరాజులు, కెవీవీ.రావు, సియాదుల ఆదినారాయణ, కర్రి శ్రీను, సత్యానారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో కలిసిన రైల్వే సిబ్బంది కుటుంబ సభ్యులు

అమలాపురం

మందపల్లి ఆదాయం రూ.1.86లక్షలు

కొత్తపేట, మే 3(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారు లుతీరారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,86,429 ఒక్క రోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు సూర్యచక్రధరరావు తెలిపారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కవిత, పూజిత, మమత శ్రీ, ప్రియాంక, నాగేశ్వరిలను అభినందించారు.

ఆదుర్రు బౌద్ధ స్థూపం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆదుర్రు గ్రామంలోని ఆదిబౌద్ధ స్థూపం అభివృద్ధికి కృషి చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే శనివారం బౌద్ధ స్థూపాన్ని సందర్శించి స్థూపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థూపం విశిష్టతను బుద్ధవిహార్ ట్రస్టు సభ్యులు ఎస్ఎస్ఆర్ భూపతి ఎమ్మెల్యేకు వివరించారు. పురాణ చరిత్ర కలిగిన ఈబౌద్ధ స్థూపం ధర్మ వికాసానికి నిదర్శనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పెద్దపెద్ద ఇటుకలతో నిర్మించిన స్థూపం, శిలాఫలకాలు, ధర్మచక్ర చిహ్నాలు ఈప్రాంత చారిత్రతక ప్రాముఖ్యతను వివరిస్తున్నాయని, గత ప్రభుత్వం ఈక్షేత్రాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని, ఏవిధంగా అభివృద్ధి చేయలేదన్నారు. ఈస్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పురావస్తుశాఖ అధికారులతో చర్చించి బౌద్ధ స్థూపానికి వచ్చే సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. బౌద్ధ స్థూపం చారిత్రక నేపథ్యాన్ని తెలియచేసేందుకు నిర్మాణాత్మక చర్యలు తీసుకుంటామని గ్రామస్తుల ఆదరణతో అధికార యంత్రాంగ సహకారంతో స్థూపాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.శ్రీనివాసరావు, నాయకులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, బోనం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, ఎంకే రజా, కోటిపల్లి సాయిబాబు, నెల్లి దుర్గాప్రసాద్, మందా గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ఆదుర్రు బౌద్ధస్థూపం వద్ద ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు

డంపింగ్ యార్డుగా శ్మశానవాటిక

- తీవ్ర దుర్గంధంతో ప్రజలకు ఇబ్బందులు
- సోంపల్లి శ్మశానవాటికను ఆశ్రయిస్తున్న వైనం

మామిడికుదురు, మే 3(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు శ్మశానవాటిక డంపింగ్ యార్డుగా మారడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికి 4.88ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో ఒక ఎకరం ఎస్టీ కాలనీకి గతంలో కేటాయించారు. ఇంకా 3.88ఎకరాల్లో శ్మశానవాటిక విస్తరించి ఉన్నప్పటికీ ఎవరైన మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆస్కారం లేకుండా పోయిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. శవ దహనానికి ఏర్పాటుచేసిన రెండు షెడ్లు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచిపోయి శిథిలస్థితికి చేరే పరిస్థితుల్లో కనిపిస్తున్నాయి. గ్రామంలో చెత్త, వ్యర్థాలన్నీ శ్మశానవాటికకు తరలించి అక్కడ వేయడం వల్ల తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోళ్ల వ్యర్థాలను కూడా శ్మశానవాటికలో వేయడం వల్ల విపరీతమైన దుర్గంధం వస్తుందని స్థానికులు తెలిపారు. శ్మశానవాటిక అంతా పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా తయారైనప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దాతల సహకారంతో ఏర్పాటుచేసిన మంచినీటి ట్యాంకు, మోటారు పనికి రాకుండా పోయింది. శ్మశాన వాటికకు వచ్చే ప్రజలు కూర్చోవడానికి దాతలు ఏర్పాటుచేసిన బల్లలు విరిగిపోయి, దిగబడిపోయి పనికిరాని పరిస్థితికి చేరినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. డంప్ యార్డుగా మారడంతో ఎవరైనా మరణిస్తే వ్యయ ప్రయాసలకోర్చి మృతదేహాలను సోంపల్లి శ్మశానవాటికకు తీసుకువెళ్లి అక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. చాలా గ్రామాల్లో స్థలాలు లేక ఇబ్బందులు పడుతుంటే మామిడికుదురులో స్థలం ఉండి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ ఏర్పాటుచేసి వ్యర్థాలను శ్మశానవాటికలో కాకుండా వేరే ప్రాంతంలో వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





శ్మశాన వాటికలో బెడ్లపై మొలిచిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన వ్యర్థాలు





శ్మశానవాటిక యావత్తు మొలిచిన మొక్కలు, శ్మశానవాటికలో వేసిన కోడి ఈకలు, వ్యర్థాలు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి



మామిడికుదురు ఎస్టీ కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మామిడికుదురు, మే 3(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురు, గెద్దాడ గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా గ్రామాల్లో గల సమస్యలను నేరుగా ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. మామిడికుదురు ఎస్టీ కాలనీని సందర్శించి అక్కడ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీకి తాగునీరు అందడంలేదని, ఇళ్లస్థలాలు ఇవ్వాలని, కాలనీని మెరక చేయించాలని అభ్యర్థించగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మామిడికుదురులో ప్రధాన సమస్య అయిన డ్రెయిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. డ్రెయిన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. మామిడికుదురు శ్మశానవాటిక, బస్‌షెల్టర్ ఆక్రమణలకు గురైందని, ఆయా ఆక్రమణలు తొలగించి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కూటమి నాయకులు దిరిశాల బాలాజీ, మెండా ఆదినారాయణ, మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, యింటి మహేంద్ర, రుద్ర శ్రీను, వర్థినేని బాబ్జి, కడలి కృష్ణమోహన్, సాపే ఏకాదశి తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై వీరేశ్వరస్వామి గ్రామోత్సవం



భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వీరేశ్వరస్వామి వారు

ఐ.పోలవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు, శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం గవ్యాంకం, స్వామివారికి పంచవిశంతి, కలశ స్థాపన, సరస్వతీహోమం, పూర్వక అభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి మూలవిరాట్‌ను పుష్పాలతో సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సహాయ కమిషనర్, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రావులపాలెం, మే 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు పాల్గొని సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. 25మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు.

జర్నలిస్టుల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం కృషి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 3(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో జర్నలిస్టులు సంక్షేమ, రక్షణ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం ప్రసన్నవిఘ్నేశ్వర ఫంక్షన్‌హాలులో ఏపీయుడబ్ల్యుజే ఉమ్మడి జిల్లాఅధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు కోనసీమ జిల్లా మహాసభలో మంత్రి సుభాష్ మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని, త్వరలో ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. జర్నలిస్టులకు సహకారం అందిస్తానన్నారు. ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకు పాలకపక్షాలు కృషి చేసి చత్తీస్‌ఘడ్ తరహాలో చట్టాలు తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి మండేలా శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడారు.

ఏపీయూడబ్ల్యుజే కార్యవర్గం ఎన్నిక:

సమావేశంలో కోనసీమ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎంఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బోడపాటి వరప్రసాద్, కోసూరి అప్పారావు, లంకెలపల్లి ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి కె.భీమశంకరం, కోశాధికారిగా ఎం.వి.అబ్బాస్ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



మంత్రి సుభాష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న స్వాతి ప్రసాద్, తదితరులు

నేడు ఎమ్మెల్యే పర్యటన

అంతర్వేది, మే 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో శనివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటిస్తారని కూటమి నాయకులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అంతర్వేది పల్లిపాలెంలో పంచాయతీ వద్ద క్షేత్రస్థాయి పరిశీలన, సమావేశం, మధ్యాహ్నం 4 గంటలకు శృంగవరప్పాడు గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తారని గ్రామస్థులు, కూటమి నాయకులు సమావేశంలో పాల్గొనాలని తెలిపారు.

'కాంపెక్టర్' మరమ్మతులతో కార్మికులకు ఇబ్బందులు





మరమ్మతులకు గురైన కాంపెక్టర్ వాహనం, కార్మికులు చేత్తో చెత్తను ఎత్తుతున్న దృశ్యం

ముమ్మిడివరం, మే 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీలో కాంపెక్టర్ వాహనం మరమ్మతులకు గురైంది. దీంతో 15 రోజులుగా డస్ట్‌బిన్‌లో చెత్త నిండిపోవడంతో రోడ్డుపైన చెత్త పడి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంపెక్టర్ వాహనం మరమ్మతులకు గురవడంతో కార్మికులే డస్ట్‌బిన్‌లో చెత్తను చేతులతో ఎత్తి తొలగించాల్సి వస్తుంది. డస్ట్‌బిన్స్‌లో నిండిపోయిన చెత్తను ఈకాంపెక్టర్ వాహనం ద్వారా తొలగిస్తారు. అయితే ఈవాహనం మరమ్మతులకు గురికావడంతో చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించాల్సి వస్తుంది. 15రోజులుగా కాంపెక్టర్ మూలన పడినా దాన్ని మరమ్మతులు చేయడానికి అధికారులు శ్రద్ధ తీసుకోకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించే కార్మికులకు మాస్క్‌లు, బ్లౌజ్‌లు అందించడం లేదని దీంతో వారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని సీఐటీయూ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆరోపించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాంపెక్టర్‌కు మరమ్మతులు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. నగర పంచాయతీలో పారిశుధ్యానికి వినియోగించే వాహనాలు అన్నింటినీ మరమ్మతులుచేసి పూర్తి కండిషన్‌లో ఉంచాలన్నారు.

ఆదమరిచి ప్రయాణం చేస్తే.. అంతే సంగతి!



పి.గన్నవరం, మే 3(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ సమీపంలో ప్రధాన రహదారిలో ఆదమరిచి ప్రయాణం చేస్తే అంతే సంగతులు. గోతులో పడి ప్రమాదానికి గురికావల్సిందే. అక్విడెక్టు దిగువున త్రీరోడ్ సెంటర్ సమీపంలో ప్రధాన రహదారి చెంతనే తాగునీరు పైపులైన్‌కు చెందిన హెయిర్ వాల్స్ చాంబర్ ఏర్పాటు చేశారు. ఇది సిమెంట్ తూరలా ఉండి పైన ఎటువంటి రక్షణ ఏర్పాటు చేయలేదు. కొత్త రోడ్డు కావడంతో రోడ్డుతో సమానంగా సిమెంట్ తూర ఉంది. దీంతో వాహనదారులకు తూర కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి హెయిర్ వాల్ చాంబర్‌పై శాశ్వత రక్షణ చర్యగా సిమెంట్ లేదా ఇనుపతో చేసిన శ్లాబ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పి.గన్నవరం నుంచి ముంగండ ప్రాజెక్ట్ వరకు ఇదేవిధంగా మరో రెండు చోట్ల హెయిర్ వాల్స్ చాంబర్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చేనేత వర్గానికి డీసీసీబీ డైరెక్టర్ పదవి ఇవ్వాలి

కోనసీమ దేవాంగ సంఘం సలహాదారు చింతా డిమాండ్



అమలాపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నామినేటెడ్ పాలకవర్గంలో చేనేత రంగానికి సంబంధించి ఒకరికి డైరెక్టర్‌గా అవకాశమివ్వాలని కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం సలహాదారుడు చింతా శంకరమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమలో ఉన్న వారికి డీసీసీబీ డైరెక్టర్ అవకాశం కల్పించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో అనుభవజ్ఞులైన చేనేత నాయకులను గుర్తించి వారికి డైరెక్టర్‌గా అవకాశమిస్తే చేనేత పరిశ్రమను ఆదుకున్నట్టు అవుతుందని శంకరమూర్తి అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు డైరెక్టర్లను చేనేత వర్గానికి చెందినవారిని నియమించడం సంప్రదాయంగా వస్తుందని, ఈసారి అదే సాంప్రదాయాన్ని కొనసాగించి చేనేత కార్మికులకు న్యాయం చేయాల్సిందిగా శంకరమూర్తి సీఎంను కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పి.గన్నవరం, మే3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. బెల్లంపూడికి చెందిన ఇసుకపూడి సూర్యనారాయణ(80) శుక్రవారం మధ్యాహ్నం వృత్తి రీత్యా ఉడి మూడి సైకిల్‌పై వెళ్తున్నాడు. గన్నవరం వైపు నుంచి వస్తున్న కారు బెల్లంపూడి ఎస్ఆర్ పెట్రోలు బంకు వద్ద సూర్యనారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతడ్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కిమ్స్'లో రెండో రోజు వెంకన్న బ్రహ్మోత్సవాలు



కుంకుమార్చనలో పాల్గొన్న కిమ్స్ ఎండీ రవికిరణ్‌వర్మ దంపతులు, మహిళలు

అమలాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి దశమ వార్షికోత్సవాలు రెండో రోజుకు చేరాయి. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చన, లక్ష్మీహోమం, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై స్వామివారి బ్రహ్మోత్సవాలను తిలకించి తరలించారు. కిమ్స్ చైర్మన్ కేవీ సత్యనారాయణరాజు-బదరీలక్ష్మి, ఎండీ కె.రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సెన్‌టాక్‌కు ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి

యానాం, మే 3(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి వివిధ కళాశాలల్లో ప్రవేశానికి 2025-26 విద్యా సంవత్సరానికి సెంట్రాలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సెన్‌టాక్) నిర్వహించే ప్రవేశాలకు ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని కోఆర్డినేటర్ తెలిపారు. అభ్యర్థులు 2025జనవరి ఒకటో తేదీ తర్వాత తీసుకున్న నివాస, కుల, దివ్యాంగ, రీజినల్ రిజర్వేషన్ తదితర పత్రాలు జతచేయాలన్నారు.

గోదావరి పుష్కరాల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 3(ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పుష్కరఘాట్ల నిర్మాణం, మరమ్మతులు, రహదారుల నిర్మాణం, ఆలయాల పునర్నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ కె.గంగవరం మండలంలో 14,కపిలేశ్వరపురం మండలంలో 8 పుష్కరఘాట్లు ఉన్నాయన్నారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే పుణ్యస్నానాలు ఆచరించే విధంగా వసతులు చేకూర్చాలన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ సూచనలతో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి రెండు రోజుల్లో ప్రభుత్వ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు.సమావేశంలో కపిలేశ్వరపురం, కె.గంగవరం ఎంపీడీవోలు, కె.గంగవరం తహసీల్దార్, ఆర్అండ్‌బీ డీఈఈ సూర్యనారాయణ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రైనేజీ, దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, పలువురు ఈవోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శంకరగుప్తం డ్రెయిన్ డ్రెడ్జింగ్ పనులకు ప్రతిపాదన

మలికిపురం, మే 3(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్‌కు సంబంధించి రూ.9కోట్లతో మిగిలిన ఎనిమిది కిలోమీటర్ల డ్రెడ్జింగ్ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. శంకరగుప్తం డ్రెయిన్ 23కిలోమీటర్లకు గతంలో 15 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్‌చేసి పూడిక తొలగించారు. మిగిలిన ఎనిమిది కిలోమీటర్లు డ్రెడ్జింగ్ పూర్తి చేస్తే రైతుల కొబ్బరి తోటల్లోకి ఉప్పునీరు వెళ్లదని తద్వారా రైతులకు కూడా మేలు జరుగుతుందన్నారు. సోంపల్లి-అబ్బిరాజుపాలెం మధ్య పంటు ద్వారా ప్రయాణికుల రవాణాకు మధ్యలో అడ్డుగా ఉన్న ఇసుక తిప్పలను తొలగించాలని జలవనరులశాఖకు తెలిపామన్నారు. అదేవిధంగా ఓఎన్జీసీ ద్వారా 9గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం, గొంది, అంతర్వేదికర, కేశవదాసుపాలెం, గుడిమూల, శృంగవరప్పాడు, మోరి, మోరిపోడు గ్రామాలకు 45రోజులు ట్యాంకర్ల ద్వారా అందిస్తామని ఆయన చెప్పారు.

'ప్రైవేటు విద్యా సంస్థలపై ఒత్తిడి తగదు'

మలికిపురం, మే 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు విద్యా సంస్థలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని, గత ప్రభుత్వ విధానాల కంటే ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల కరస్పాండెంట్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని కోనసీమ జిల్లా అపుస్మా ప్రెసిడెంట్ ఎస్వీ రమణారావు అన్నారు. శనివారం లక్కవరంలో ప్రగతి పాఠశాలలో నిర్వహించిన రాజోలు డివిజన్ అపుస్మా కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఆరు నెలలకు ఏదో ఒక జీవోతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వ వైఖరి కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా లేదని, బడ్జెట్‌స్కూల్స్ మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈనెల7న విజయవాడలో జరగబోయే ప్రైవేటు స్కూల్స్ యూనియన్ మీటింగ్‌లో పలు నిర్ణయాలు తీసుకుంటామని, వాటికి అనుగుణంగా కార్యాచరణ ఉంటుందన్నారు. రాష్ట్రఉపాధ్యక్షుడు గోపీనాథ్, జిల్లా కార్యదర్శి అయ్యప్పనాయుడు, డివిజన్ కార్యదర్శి చిన్నా, జిల్లా ఎగ్జిక్యూటివ్ దివ్వి రాఘవేంద్రనాయుడు, సూరిబాబు, పీవీవీ ప్రసాద్, ఎన్.శ్రీనివాస్, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు సీట్లు

అల్లవరం, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్ట ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో చేరే పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలని మండల విద్యాశాఖాధికారి కె.కిరణ్‌బాబు తెలిపారు. మే2నుంచి 19వరకు వెబ్‌సైట్‌లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల తల్లిదండ్రులు ఆధార్, ఓటరుకార్డు, రేషన్‌కార్డు, భూమిహక్కుల పత్రం, ఉపాధిహామీలో జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు వంటివి పత్రాల్లో ఏదోక గుర్తింపు కార్డు, పిల్లల వయసు ధ్రువీకరణపత్రాలను సమర్పించాలన్నారు. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో మే 31వ తేదీ నాటికి ఐదేళ్లు నిండిన పిల్లలు, ఐబీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈఏడాది మార్చి 31నాటికి ఐదేళ్లు నిండినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 18004258599 సెల్‌ను సంప్రదించాలని ఎంఈవో సూచించారు.

ఓఎన్జీసీ ఆధ్వర్యంలో తాగునీటి పంపిణీ

అంతర్వేది, మే 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది తీరప్రాంతంలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో శనివారం తాగునీటిని పంపిణీ చేశారు. తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మంచినీటిని పంపిణీ చేస్తున్నారు. అంతర్వేది, అంతర్వేదిపల్లిపాలెం, దేవస్థానం, కేశవదాసుపాలెం మారుమూల ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు.

గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టండి



అయినవిల్లిలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో

అయినవిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి డీఎల్పీవో బొజ్జిరాజు అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.భీమారావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్‌పై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రతీ ఇంటి వద్ద నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సేంద్రీయ ఎరువుగా తయారు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో జి.భీమారావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో అందరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కె.రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదాతలను వణికిస్తున్న వాతావరణం

అయినవిల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా వస్తున్న మార్పులతో వాతావరణం మారి వర్షం జల్లులు పడుతుండడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలను రక్షించుకునే ప్రయత్నాల్లో రైతులు నిమగ్నమవుతున్నారు. మండలంలో 8200 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేశారు. 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ పశుగ్రాసాలను ఒబ్బిడి చేసుకునే పనులను రైతులు చేసుకుంటున్నారు. మెట్ట రైతులు కూడా ఇబ్బందులు ఎర్కొంటున్నారు. మొక్కజొన్న తదితర పంటలు ఒబ్బిడి చేసుకోవడానికి శ్రామికల కొరత ఏర్పడిందని రైతులు అంటున్నారు.

బాధిత కుటుంబాలకు ప్రముఖుల పరామర్శ

అంబాజీపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందగా శనివారం బాధిత కుటుంబాలను పలువురు ప్రముఖులు పరామర్శించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు చిత్రపటాలకు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌లు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్వామినాయుడు తండ్రి పత్తి దత్తుడు, కుంపట్ల శ్రీనివాసరావులను పరామర్శించి ఓదార్చారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెట్ల రమణబాబు, ఆడా చైర్మన్ అల్లాడ సోంబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, నల్లా స్వామి, చిట్టిబాబు, పి.కె.రావు, విత్తనాల శేఖర్, కొర్లపాటి కోటబాబు, సుదాబత్తుల రాము తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

'లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాం'

రాజోలు, మే 3(ఆంధ్రజ్యోతి): రాజోలు సెక్షన్‌లో 5ఎంవీఏ స్థానంలో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి మార్చామని అమలాపురం విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు శనివారం తెలిపారు. రాజోలు మండలంలోని పదహారు గ్రామాల్లో విద్యుత్ అధికలోడు సమస్యను పూర్తిగా పరిష్కరించామని, ఈపని పూర్తిచేయడానికి నాలుగు రోజులు పట్టిందన్నారు. అమలాపురంఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు, రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.మల్లిక, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాజు, అసిస్టెంట్ ఇంజనీర్ ఆనందప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ పి.మనోజ్ఞ పాల్గొన్నారు.

భవ్యశ్రీదుర్గకు సత్కారం

రాజోలు, మే 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో కూనవరం ప్రభుత్వ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో కుసుమ భవ్యశ్రీదుర్గ 579మార్కులు సాధించి స్కూలు టాపర్‌గా నిలిచింది. భవ్యశ్రీదుర్గను దళిత చైతన్యవేదిక నాయకులు శనివారం దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, మట్టా సురేష్‌కుమార్, నల్లి నాగబాబు, చిలకపాటి శ్రీధర్, చెల్లింగి త్రినాథరావు, చింతా శ్రీనివాస్, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మామిడికుదురు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పేర్కొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో మనం చదువుకున్న బడి, మన ఊరు బడి, ప్రభుత్వ బడి అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మండల విద్యావనరుల వద్ద ఎంఈవోలు శనివారం ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలపై ఏవిధమైన ఒత్తిడి లేకుండా విద్యార్థులకు అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కారుపల్లి కల్యాణ్‌బాబు, కొమ్ముల వీరరాఘవరావు, మట్టా నాగరాజు, నేల వెంకటేశ్వరరావు, ఉండ్రు శ్రీరమణ పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు సర్వం సిద్ధం

యానాం, మే 3(ఆంధ్రజ్యోతి): యానాంలో ఆదివారం జరగనున్న నీట్ ప్రవేశ పరీక్షకు యానాం పాలనా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో వైద్య వృత్తిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష జరుగుతుంది. యానానికి సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయాన్ని పరీక్షా కేంద్రంగా కేటాయించారు. యానాంలో 134మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిఇస్తారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరుగుతుంది. శనివారం పరీక్ష కేంద్రంలోని ఇన్విజలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పి మునిస్వామి, విద్యాలయం ప్రతినిధులు ప్రకాశరావు, శరత్‌చంద్రకీర్తి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ర్యాలి కేశవస్వామి ఆలయంలో అయోధ్యవాసులు



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో అయోధ్య వాసులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం అయోధ్య భాగ్యనగర్ సీతారామ ఫౌండేషన్ నిర్వాహకుడు త్సల్లా శ్రీనివాస శాస్త్రి, గాయత్రి దంపతులు అయోధ్య శ్రీరామచంద్రమూర్తికి ధనుర్బాణాలు సమర్పించేందుకు దేశంలోని పుణ్యక్షేత్రాలు సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందచేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.21.52లక్షలు

అలమూరు, మే 3(ఆంధ్రజ్యోతి): అలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి హుండీ లెక్కింపు శనివారం నిర్వహించగా రూ.21,52,499లు ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు, నూకాంబికా అమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా నెలరోజులు వ్యవధిలో రెండో సారి ఆలయం వద్ద ఉన్న 9హుండీలను ఆలయ ఉత్సవ ప్రత్యేకాధికారి బాలాజీరాంప్రసాద్, ఈవో వీర్రాజుచౌదరి, ఉత్సవకమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు, మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు తదితరల సమక్షంలో తెరిచారు. వివిధ ఆలయాల నుంచి వచ్చిన ఆలయ సిబ్బంది, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. హుండీల లెక్కింపుల ద్వారా వచ్చిన రూ.21.52లక్షలను బ్యాంక్‌లో జమ చేసినట్లు ఈవో వీర్రాజు తెలిపారు.



చింతలూరు నూకాంబిక అమ్మవారి హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మెరిట్ విద్యార్థినులను అభినందించిన మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో నియోజకవర్గస్థాయిలో ప్రథమస్థానం పొందిన తోటపేటకు చెందిన దవులూరి మేఘన, ద్వితీయ స్థానం సాధించిన వెలంపాలెంకు చెందిన తలాటం శ్రీ సూర్య భవితలను మంత్రి సుభాష్ అభినందించారు. సామాన్య కుటుంబాలకు చెందిన వారిద్దరు ప్రతిభ కనపరచడం పట్ల వైసీపీ ఇన్‌చార్జి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి సుభాష్

రాజేష్‌చౌదరికి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం



ఎన్టీఆర్ కీర్తి పురస్కారాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నుంచి అందుకుంటున్న రాజేష్ చౌదరి

అలమూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి ఎన్టీఆర్ కీర్తి పురస్కారాల్లో భాగంగా గుమ్మిలేరుకు చెందిన రెడ్డి రాజేష్‌చౌదరికి కీర్తి పురస్కారం అందించారు. పాన్ ఇండియా, ఫిలాన్ త్రోఫిక్ సొసైటీ సంయుక్త అధ్వర్యంలో శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పాన్ ఇండియా వ్యవస్థాపకుడు అద్దంకి రాజాల చేతుల మీదుగా ఆయ న్ను సత్కరించి జ్ఞాపిక అందించారు. ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్న రాజేష్ చౌదరిని గుమ్మిలేరు కాకతీయ యూత్ నాయకులు గుణ్ణం శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు, రెడ్డి రుద్రయ్యచౌదరి, యదగని సతీష్, ముత్యాల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



సోమేశ్వరంలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం శిక్షణ

రాయవరం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం, సోమేశ్వరం గ్రామాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ పీవో గజలక్ష్మి ఆదేశాలపై మాచవరం సెక్టార్ సూపర్‌వైజర్ విష్ణుకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాచవరం సర్పంచ్ కత్తుల సీతా మహాలక్ష్మి మాట్లాడారు. కిశోర బాలికల్లో వచ్చే మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలని సూపర్‌వైజర్ తెలిపారు. బాలికలు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత, వంటి 12 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యం

కొత్తపేట, మే 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మెరుగైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఇందులో భాగంగా కొత్తపేట మండలం మోడేకుర్రు, ఆలమూరు మండలం మడికి గ్రామాలకు నాబార్డు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే రోడ్ల నిర్మాణం చేపడతామని సత్యానందరావు స్పష్టం చేశారు.

త్వరలో అన్నక్యాంటిన్: త్వరలో కొత్తపేటలో అన్నక్యాంటిన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శనివారం రైతుబజార్ పక్కన ఉన్న సత్రం స్థలంలో క్యాంటిన్ పనులు చేడతామన్నారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, బూసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వీరేశ్వరస్వామివారు

ఐ.పోలవరం, మే 3(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోల వరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు, శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం గవ్యాంకం, స్వామివారికి పంచవిశంతి, కలశస్థాపన, సరస్వతీహోమం, పూర్వక అభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి మూలవిరాట్‌ను పుష్పాలతో సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సహాయ కమిషనర్, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కవిత, పూజిత, మమత శ్రీ, ప్రియాంక, నాగేశ్వరిలను అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాయవరం సభలో మాట్లాడుతున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శ్రీకారం

రాయవరం, మే 3(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం రాయవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అభివృద్ధి, సంక్షేమం పట్ల నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింద న్నారు. మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి శిక్షణలను అందిస్తుందన్నారు. తొలుత రాయవరంలో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైన్లు ప్రారంభించారు. రాయవరం పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా దాన్ని బీసీ వసతిగృహంలోకి మార్పు చేయగా ఎమ్మెల్యే దాన్ని ప్రారంభించారు. కిషోర బాలికలకు వేసవి శిక్షణలో జూన్ 10 వరకు జరిగే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బస్టాండ్‌లో టీడీపీ బీసీ నాయకుడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తుండగా కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రామచంద్రపురం వాటర్ డీసీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఎర్రపోతవరం డీసీ వైస్ చైర్మన్ కొరుపెళ్ల శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, తహశీల్దారు ఐపీ శెట్టి, రాయవరం వైద్యాధికారులు డాక్టర్ రమ్యశ్రీ, అనిరుధ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ: మాచవరం గ్రామానికి చెందిన అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత తాడి రామారెడ్డికి పితృ వియోగం కలిగింది. ఈ నేపథ్యంలో ఆయన్ను శనివారం ఎమ్మెల్యే పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మేడపాటి రవీంద్రారెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి, తాడి సూర్యనారాయణరెడ్డి, రిమ్మలపూడి బ్రహ్మారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆదాయం రూ.1.86 లక్షలు


కొత్తపేట, మే 3(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,86,429 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు సూర్యచక్రధరరావు తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కె.గంగవరం, మే 3(ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధూ డిమాండ్ చేశారు. గంగవరంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లాలో అకాల వర్షాలకు వరి రైతులు చాలా నష్టపోతున్నారని వాపోయారు. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడం వల్ల రైతు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

మండపేట, మే 3(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు ధ్వజమెత్తారు. మండపేట రామచంద్రపురం కెనాల్ రోడ్డులో శనివారం ఉదయం తాపీపని కోసం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు కూలీలను పెద్దకాల్వ వంతెన వద్ద ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టడంతో మండపేటకు చెందిన కూలీలు కె.సత్తిబాబు, ఖండవల్లి ఆనంద్ గాయపడ్డారు. ఇది తెలుసుకున్న జట్టుమేస్త్రి చిట్టిబాబు 108లో వారిని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవటంతో క్షతగాత్రులకు వైద్య సేవలు అందలేదని జయరాజు ఆరోపించారు. వైద్యులు చేయాల్సిన వైద్యాన్ని ఎంఎన్‌వో చేస్తూ రోగులకు కుట్లు వేశారన్నారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. వైద్యులు నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



ఎమ్మెల్యే వేగుళ్లను సన్మానిస్తున్న ఉదయభాస్కర్

ఘనంగా క్రైస్తవ సంగీత సువార్త మహోత్సవాలు

మండపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో ప్రభు త్వ ఆసుపత్రి వెనుక ఉన్న బెతెస్థ ప్రార్ధనా మందిరం ఆధ్వర్యంలో క్రైస్తవ సంగీత సువార్త మహోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ ఎదురుగా గల స్థలంలో సంఘకాపరి బిషప్ డాక్టర్ చిలుకూరి ఉదయభాస్కర్ సారథ్యం లో గురు, శుక్ర, శనివారాల్లో జరిగిన ఈ మహోత్సవాల్లో దైవజనులు బిషప్ డాక్టర్. డేనియేల్‌పాల్, రెవ.డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్, డాక్టర్ ఆసాపు, బ్రదర్ జార్జ్ బుష్ దేవుని వాక్యం బోధించారు. డాక్టర్ జేకే క్రిస్టఫర్ లిలియన్, బ్రదర్ వైసునీల్ సుజాత, బ్రదర్ నిస్సీజాన్ గీతాలను ఆలపించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. చివరి రోజు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గోదావరి పుష్కరాల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 3(ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పుష్కరఘాట్ల నిర్మాణం, మరమ్మతులు, రహదారుల నిర్మాణం, ఆలయాల పునర్నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ కె.గంగవరం మండలంలో 14, కపిలేశ్వరపురం మండలంలో 8 పుష్కరఘాట్లు ఉన్నాయన్నారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే పుణ్యస్నానాలు ఆచరించే విధంగా వసతులు చేకూర్చాలన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ సూచనలతో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి రెండు రోజుల్లో ప్రభుత్వ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. సమావేశంలో కపిలేశ్వరపురం, కె.గంగవరం ఎంపీడీవోలు, కె.గంగవరం తహసీల్దార్, ఆర్అండ్‌బీ డీఈఈ సూర్యనారాయణ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రైనేజీ, దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, పలువురు ఈవోలు, ఇతర శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



మంత్రి సుభాష్‌కు జ్ఞాపిక అందచేస్తున్న స్వాతి ప్రసాద్ తదితరులు

ఏపీయూడబ్ల్యూజే మహాసభలో మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 3 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాలులో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు కోనసీమ జిల్లా మహాసభలో మంత్రి సుభాష్ మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇస్తామన్నారు. జర్నలిస్టుల రక్షణకు జిల్లాస్థాయిలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చే అంశం పరిశీలనలో ఉందని త్వరలో వాటిని అందచేస్తామన్నారు. రామచంద్రపురంలో జర్నలిస్టులకు వైద్య శిబిరం ఏర్పాటు చేయిస్తానన్నారు. ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకు పాలకపక్షాలు కృషిచేసి చత్తీస్‌ఘడ్ తరహాలో చట్టాలు తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, జనసేన ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు.

ఏపీయుడబ్ల్యుజే కార్యవర్గం ఎన్నిక: సమావేశంలో కోనసీమ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఎన్‌వి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బోడపాటి వరప్రసాద్, కోసూరి అప్పారావు, లంకెలపల్లి ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి కె.భీమశంకరం, కోశాధికారిగా ఎంపీ అబ్బాస్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

రావులపాలెం, మే 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బం దులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల లో రైతుల సమస్యలు, ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయన్నారు. దీంతో వ్యవసాయశాఖ మంత్రిని, పౌర సరఫరాల శాఖ ఎండీలతో మాట్లాడి లక్ష్యాలను పెంచాలని కోరామన్నారు. దీంతో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాలను పెంచేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైస్‌మిల్లర్లతో కూడా చర్చించినట్టు తెలిపారు. రైతులకు అన్నివిధాల అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కిషోర బాలికా వికాసం-2 వేసవి శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి అన్నారు. శనివారం కపిలేశ్వరపురం గ్రామ పంచాయతీ, టేకి అంగన్‌వాడీ కేంద్రం వద్ద సీడీపీవో ఎ.గజలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహించిన కిషోర వికాసం-2 వేసవి శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. జూన్ 2 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, కుక్కల నాగమణి, జీఎంఎస్‌కె లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, స్థానిక నాయకులు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 10 వరకు అంగన్‌వాడీల్లో కిషోరి వికాసం



అర్తమూరులో కిషోర వికాసం సభ నిర్వహిస్తున్న దృశ్యం

మండపేట, మే 3(ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చేనెల 10 వరకు కిషోరి వికాసం నిర్వహిస్తున్నట్టు వక్తలన్నారు. అర్తమూరులో జరిగిన కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండపేట మండలం కేశవరంలో వున్న అంగన్‌వాడి కేంద్రంలో శనివారం మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ సత్యనారాయణ మూర్తి ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. చదువుతోపాటు విద్య, విజ్ఞానం విద్యార్థి దశ నుంచి అవసరమని వారన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కిషోరి వికాసం కార్యక్రమం ఎంతో ప్రయోజనం ఉందని వారన్నారు. వేసవి శిక్షణలో భాగంగా వీటిని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారిణి గజలక్ష్మి, పడాల సుబ్బా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

సత్తెమ్మ అమ్మవారికి పూజలు

రాయవరం, మే 3(ఆంధ్రజ్యోతి): రజకుల పేటలోనున్న సత్తెమ్మ అమ్మవారి పదో వార్షికోత్సవాన్ని శనివారం జరిపారు. సత్తెమ్మతల్లి భక్త సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామస్తులు, భక్తులు ఉన్నారు.



ర్యాలి రక్షిత మంచినీటి పథకం పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభం

హైటెన్షన్ లైన్లతో పొంచి వున్న ముప్పు

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ర్యాలి వాటర్ ట్యాంక్ వద్ద హైటెన్షన్ విద్యుత్ లైన్లతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంకంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ విద్యుత్ సరఫరా జరుగుతోంది. ర్యాలి మంచినీటి వాటర్ ట్యాంక్ పక్కనే హైటెన్షన్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మంచినీటి పథకం ట్యాంకును శుభ్రం చేసేందుకు సిబ్బంది మెట్ల మార్గం ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. మెట్ల చెంతనే ఉన్న కరెంట్ స్తంభాన్ని మార్పు చేయాలని పలువురు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రతి ధాన్యంగింజను కొనుగోలు చేసేందుకు కృషి

రావులపాలెం, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడిన సమస్యలతో శనివారం గోపాలపురంలో రైతులు నిరసన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజను మిల్లర్లు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

రావులపాలెం, మే 3(ఆంధ్రజ్యోతి): బాటసారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేసవిలో చలివేంద్రాలు ఎంతగానో దోహదపడాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దేవరపల్లిలో నామన సూరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రావులపాలెం, మే 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు పాల్గొని సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట మండలాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు బాధితులకు అందజేత

మండపేట, మే 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆయా ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న 53 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం పార్టీ కార్యాలయంలో బాధితులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. ఆర్థిక సహాయానికి సహకరించిన ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పి.గన్నవరం, మే 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. బెల్లంపూడికి చెందిన ఇసుకపూడి సూర్యనారాయణ(80) శుక్రవారం మధ్యాహ్నం వృత్తి రీత్యా ఉడి మూడి సైకిల్‌పై వెళ్తున్నాడు. గన్నవరం వైపు నుంచి వస్తున్న కారు బెల్లంపూడి ఎస్ఆర్ పెట్రోలు బంకు వద్ద సూర్యనారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతడ్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.